సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం ౹ 9 ౹ మార్చి ౹ 2025



... మామిడి తింటామా?

ఈసారి మామిడికి ఆలస్యంగా పూత రావడం. పిందెలు రాలిపోవడం వంటి కారణాలతో దిగుబడిపై ఆందోళన నెలకొంది. 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆదివారం సా॥) 6.23

సహర్ (సోమవారం ఉ॥) 5.05

వాతావరణం

గరిష్టం / కనిష్టం 38° / 21°

జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. సాయంత్రం వరకు వడగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణంలో స్వామివారు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో స్వామివారి మూల మూర్తులకు శనివారం సువర్ణ తులసీ అర్చన పూజలు చేశారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని మేళ తాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు.

రామాలయానికి రూ.5,02,116 విరాళం

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి మిట్టకంటి రామిరెడ్డి–చంద్రకళ దంపతుల కూతురు, అల్లుడు సామ శ్రీ హర్షిత–శ్రీకాంత్‌రెడ్డి శనివారం రూ.5,02,116 విరాళం అందజేశారు. ఖండాలు దాటినా పుట్టిన ఊరుపై మమకారంతో భారీ విరాళం అందజేసిన హర్షిత–శ్రీకాంత్ రెడ్డి దంపతులను గ్రామస్తులు అభినందించారు. మిట్టకంటి రామిరెడ్డి ఉపాధ్యాయుడిగా గ్రామంలో ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పారని పేర్కొన్నారు. బూర్గంపాడు మాజీ జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, రామకొండారెడ్డి దంపతులు రూ. 10 వేలు, ఎస్‌కేటీ గ్రూప్ అధినేత దోసపాటి పిచ్చేశ్వరరావు రూ.25,116 విరాళం అందజేశారు.

‘పర్ణశాల’ ముఖద్వారానికి ఇత్తడి తొడుగు



ఆలయ ద్వారానికి ఏర్పాటు చేసిన ఇత్తడి తొడుగు

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల శ్రీ సీతారామ చంద్రస్వామివారి ఆలయ ముఖ ద్వారానికి హైదరాబాద్‌వాసి మహాలక్ష్మి ఇత్తడి కవచం వితరణ చేశారు. సుమారు రూ.3 లక్షల వ్యయంతో ముఖ మండప ద్వారం, తలుపులతో సహా ఇత్తడి తొడుగు చేయించారు. ఈ తొడుగులను హైదరాబాద్‌కు చెందిన రాఘవ తయారుచేశారు. ఈఓ రమాదేవి, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్రంలో మంత్రి తుమ్మల



కూరగాయలను పరిశీలిస్తున్న మంత్రి

దమ్మపేట : మండల పరిధిలోని అప్పారావుపేట గ్రామ శివారులో ఉన్న సొంత వ్యవసాయ క్షేత్రాన్ని శనివారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించారు. క్షేత్రంలో సాగు చేస్తున్న క్యాబేజీ, కాలీఫ్లవర్, టమాట, సొరకాయ తదితర పంటలను పరిశీలించి కోయించారు. తుమ్మలతోపాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు కాసాని నాగప్రసాద్, తుమ్మల శేషుబాబు, ఎర్రా వసంతరావు తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి రెండో విడత టెండర్లు

- తొలివిడతలో తునికాకు సేకరణకు రెండు యూనిట్లలోనే ఖరారు

పాల్వంచరూరల్ : ఈ నెల 10, 11 తేదీల్లో రెండో విడత తునికాకు టెండర్ల ప్రక్రియ నిర్వహించనున్నారు. ఈసారి తునికాకు టెండర్ల ప్రక్రియలో జాప్యం జరిగింది. దీంతో కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడంలేదు. ఏజెన్సీలో ఏటా రెండు నెలల పాటు గిరిజనులు, గిరిజనేతరులకు ఉపాధి కల్పించే తునికాకు సేకరణకు ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆన్‌లైన్‌లో టెండర్లు నిర్వహిస్తోంది. ఈ సీజన్‌లో మొదటి విడతగా గత నెల 27, 28 తేదీల్లో టెండర్ల ప్రక్రియ నిర్వహించారు. జిల్లాలోని ఆరు డివిజన్ల పరిధిలో 59 యూనిట్‌లు ఉండగా, కేవలం చర్ల, దుమ్ముగూడెం రేంజ్‌లోని రెండు యూనిట్లలో మాత్రమే తునికాకు సేకరణకు టెండర్లు ఖరారయ్యాయని డీఎఫ్‌ఓ జి.కృష్ణాగౌడ్ తెలిపారు. ఇంకా 57 యూనిట్లకు టెండర్లు ఖరారు కావాల్సి ఉండగా, రేపటి నుంచి రెండో విడత, ఈ నెల 20, 21 తేదీల్లో మూడో విడత టెండర్ల ప్రక్రియ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఇక ఆన్‌లైన్ చెల్లింపులు!

- మధ్యాహ్న భోజన బిల్లుల్లో జాప్యం లేకుండా చర్యలు
- భద్రాద్రితోపాటు పెద్దపల్లి జిల్లా పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక
- పూర్తిస్థాయిలో వివరాలు సేకరించిన సాంకేతిక నిపుణులు
- ఎండీఎం కార్మికుల సమస్యలకు చెక్ పెట్టేలా ప్రభుత్వ కసరత్తు



మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

కొత్తగూడెంఅర్బన్: మధ్యాహ్న భోజన పథకం(ఎండీఎం) కార్మికులు అప్పుల్లో కూరుకుపోతున్నారు. వేతనాలు, బిల్లులు ప్రతి నెలా విడుదల కాకపోవడంతో అవస్థ పడుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన వర్కర్ల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టింది. ఆన్‌లైన్ బిల్లులు చెల్లించేందుకు కసరత్తు చేస్తోంది. గత ఫిబ్రవరిలో జిల్లాలో కొత్తగూడెం మండలంలోని పాఠశాలల్లో కార్మికుల వేతనాలు, బిల్లుల పెండింగ్ తదితర అంశాలపై కలెక్టర్ జితేష్ వి.పాటిల్, డీఈఓ, ఎంఈఓతో చర్చించారు. విద్యార్థుల ఫేస్ రికగ్నేషన్‌ను మరింత అభివృద్ధి పరిచి కార్మికులకు వేతనాలు, బిల్లులు చెల్లిస్తే జాప్యం ఉండదని కలెక్టర్ నివేదిక ఇవ్వడంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా పరిశీలించి ఆమోదించింది. ట్రెజరీ ద్వారా బిల్లుల చెల్లింపుల ప్రక్రియ ఆలస్యమవుతోందని, నేరుగా ఆన్‌లైన్ నుంచే బిల్లులు చెల్లించే అవకాశాలను పరిశీలిస్తున్నామని, ఇందుకు యాప్ రూపొందిస్తున్నామని ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి జిల్లాల్లో ఒక్కో మండలాన్ని ఎంపిక చేసుకుని, నెల రోజుల పాటు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన బిల్లులను ఆన్‌లైన్ ద్వారా చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఆన్‌లైన్ బిల్లులతో ఎదురుచూపులకు చెక్ పడే అవకాశం ఉంటుందని మధ్యాహ్న భోజన కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

2,150 మంది కార్మికులు

జిల్లాలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు 2,150 మంది ఉన్నారు. వీరందరికీ ఒకేసారి బిల్లులు మంజూరు కావడం లేదు. జిల్లాలోని 23 మండలాలు ఉండగా, అన్నీ మండలాలకు ఒకేసారి బిల్లులు రావడం లేదు. మూడు, నాలుగు నెలలకోసారి పది మండలాలకు వస్తే, రెండో దఫా, మూడో దఫాలో మిగతా మండలాలకు బిల్లులు మంజూరవుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాను పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేయడంతో ఇక్కడి ఎండీఎం కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా బిల్లుల చెల్లింపు ప్రక్రియ విజయవంతమైతే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నారు.

వివరాలు సేకరించిన నిపుణులు



వివరాలను పరిశీలిస్తున్న రాష్ట్ర సాంకేతిక విభాగం పరిశీలకుడు

ఆన్‌లైన్ విధానంలో మధ్యాహ్న భోజన బిల్లులు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భద్రాద్రి–కొత్తగూడెం, పెద్దపల్లి జిల్లాలను పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసింది. ఈ క్రమంలో రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా, విద్యాశాఖ కమిషనర్ నరసింహారెడ్డి, కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌తో చర్చలు జరిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆన్‌లైన్ విభాగ నిపుణుడు ప్రశాంత్‌రెడ్డి గత గురువారం కొత్తగూడెంలో పర్యటించి కావాల్సిన సమాచారాన్ని సేకరించారు. డీఈఓ వెంకటేశ్వరాచారి, కొత్తగూడెం ఎంఈఓ ప్రభుదయాల్ నుంచి పూర్తి వివరాలు సేకరించారు. నెల పూర్తికాగానే బిల్లులు జనరేట్ అవుతూ ఏకకాలంలో చెల్లింపులు జరిగేలా మార్పులు చేయనున్నారు.

యాప్ రూపొందిస్తున్నారు..



జిల్లాలోని మధ్యాహ్న భోజన పథక కార్మికులకు ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించేందుకు జిల్లా పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైంది. రాష్ట్ర పరిశీలకులు కొత్తగూడెం వచ్చి పరిశీలించారు. వివరాలు సేకరించి, యాప్‌ను రూపొందించే ప్రక్రియ కొనసాగుతోంది. యాప్ పూర్తయితే బిల్లులు క్రమం తప్పకుండా విడుదలవుతాయి.

–వెంకటేశ్వరాచారి, జిల్లా విద్యాశాఖాధికారి

సమానత్వం ఇంటి నుంచే ప్రారంభం కావాలి



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్, పక్కన ఎమ్మెల్యే వెంకట్రావు తదితరులు

మహిళా దినోత్సవంలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్

దుమ్ముగూడెం: మహిళల సమానత్వం మన ఇంటి నుంచే ప్రారంభం కావాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. శనివారం మండలంలోని బొజ్జిగుప్ప ఎకో టూరిజం స్పాట్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారతీయ సమాజంలో మహిళకు సముచిత స్థానం ఉందని పేర్కొన్నారు. టీచర్, డాక్టర్, పోలీస్ ఆఫీసర్, పైలట్‌గా రాణిస్తున్న ఆమె ఇంటిని కూడా చక్కదిద్దుతోందని అన్నారు. బొజ్జిగుప్ప గిరిజనులు చాలా కష్టజీవులని, టూరిజం స్పాట్ ఏర్పాటుకు ఎంతో శ్రమించి ముందుకు వచ్చారని అభినందించారు. కరక్కాయలు, ఇప్పపూల ఉత్పత్తులను ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురోగమించేలా చేయడమే ప్రభుత్వ సంకల్పమని అన్నారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించారు. ఆ తర్వాత కలెక్టర్, ఎమ్మెల్యే కూడా మహిళలను సన్మానించి, గిరిజన మహిళలు తయారుచేసిన రాగిజావ తాగారు.

పర్ణశాలలో షాపుల క్రమబద్ధీకరణ..

పర్ణశాలలో షాపుల క్రమబద్ధీకరణ చేపడతామని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. శనివారం భద్రాచలం ఎమ్మెల్యేతో కలిసి పర్ణశాలలో పర్యటించి మాట్లాడారు. మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, సీఐ అశోక్, ఎంపీడీఓ రామకృష్ణ, ఆలయ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్, ఆర్‌ఐ కల్లూరి వెంకటేశ్వరరావు, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉన్నతికి కృషి

- సంస్థ సీఎండీ బలరామ్ నాయక్

సింగరేణి(కొత్తగూడెం): అందరూ సమష్టిగా సంస్థ ఉన్నతికి కృషి చేయాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ నాయక్ సూచించారు. శనివారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో గుర్తింపు సంఘం (ఏఐటీయూసీ), ప్రాతినిధ్య సంఘం (ఐఎన్‌టీయూసీ)లతో నిర్వహించిన సంయుక్త సంప్రదింపుల కమిటీ సమావేశంలో మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా రెండు గనుల్లో ఒక షిఫ్ట్ మొత్తం మహిళా ఉద్యోగులతో నిర్వహించే ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల్లో క్రమశిక్షణ, సమయపాలన పెంచితే ఉత్పత్తి, ఉత్పాదకత పెరిగే అవకాశం ఉందన్నారు. సింగరేణి జాతీయస్థాయి కంపెనీగా ఎదగనుందని తెలిపారు. విదేశాల్లో కీలక ఖనిజాల ఉత్పత్తిలో అడుగుపెట్టిందని, బొగ్గు ఉత్పత్తితోపాటు ఇతర వ్యాపార విస్తరణ చర్యలను చేపట్టిందని వివరించారు. ఇటీవల రాజస్థాన్ ప్రభుత్వంతో 1,600 మెగావాట్ల థర్మల్, 1500 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఒడిశాలోని నైనీ బ్లాకు నుంచి మరో నెల రోజుల్లో బొగ్గు ఉత్పత్తి ప్రారంభం కానుందని అన్నారు. 2025–26లో మరో మూడు కొత్త ప్రాజెక్ట్‌లను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షకార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్, ఐఎన్‌టీయూసీ నేత జనక్ ప్రసాద్, నరసింహారెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీపతి గౌడ్, డైరెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అతిథులకు ఆహ్వానం..

- భద్రాచలంలో ఆధ్యాత్మికతతోపాటు వినోదం
- ఆకర్షణీయంగా మారుతున్న గిరిజన మ్యూజియం
- ఐటీడీఏ ప్రాంగణంలో పార్క్, ఓపెన్ జిమ్ పూర్తి
- ప్రత్యేకంగా దృష్టి సారించిన కలెక్టర్, పీఓ





మ్యూజియం ప్రాంగణంలో సిద్ధమైన గిరిజన పల్లె (ఇన్‌సెట్) చిల్డ్రన్ పెడల్ బోటింగ్‌కు సిద్ధం చేసిన పాండ్



చిన్నారుల కోసం సిద్ధమైన పార్క్

భద్రాచలం: ఏజెన్సీ అందాలను తిలకించేందుకు వచ్చే పర్యాటకులు, రామయ్య దర్శనానికి వచ్చే భక్తులకు ఆహ్వానం పలికేందుకు భద్రాచలంలో గిరిజన మ్యూజియం సిద్ధమవుతోంది. చిన్నారులను ఆటపాటలతో అలరించనుంది. గిరిజన సంస్కృతీ సంప్రదాయాలు వీక్షకులకు తెలిసేలా రూపుదిద్దుకుంటోంది. కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్ పర్యవేక్షణలో పనులు వేగవంతంగా సాగుతున్నాయి.

శరవేగంగా పనులు..

భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియంలో ఆదివాసీల దుస్తులు, పనిముట్లు, వస్తువులు ప్రదర్శనకు ఉంచారు. గిరిజన సంస్కృతి ప్రతిబింబించేలా ‘గిరిజన పల్లె’తరహాలో వెదురు, మట్టి నిర్మాణాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. చిన్నారుల ఆటపాటలకు బొమ్మలతో పార్క్, ఓపెన్ జిమ్ సిద్ధం చేశారు. పెడల్ బోటింగ్‌కు పాండ్ రూపొందించారు. యువత, పెద్దలకు బీచ్ తరహాలో ‘ఇసుక వాలీబాల్’, బాక్స్ క్రికెట్, షెటిల్ కోర్టులను సిద్ధం చేస్తున్నారు. వీటి పనులు శరవేగంగా సాగుతుండగా, గిరిజన వంటకాలు, వస్తువులతో స్టాల్స్, గిరిజన ఉత్పత్తులను సైతం రెడీ చేస్తున్నారు.

శ్రీరామనవమిలోగా అందుబాటులోకి..

ముక్కోటి నాటికి గిరిజన పల్లె పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని భావించారు. కానీ కలెక్టర్, పీఓ సూచనల మేరకు ఆహ్లాదం కల్పించేలా మరికొన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలోనే పెడల్ బోటింగ్, ఓపెన్ జిమ్, పార్క్‌లను సిద్ధం చేశారు. వచ్చే నెల 6న శ్రీరామనవమి జరగనున్న నేపథ్యంలో ఈ నెల 30వ తేదీ లోపు అన్ని పనులు పూర్తి చేయాలని పీఓ ఆదేశాలు జారీ చేశారు. ఈసారి శ్రీరామనవమికి వచ్చే భక్తులు, పర్యాటకులకు ఆధ్యాత్మికతతోపాటు ఆట పాటలతో వినోదం కూడా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

భవిత కేంద్రాల అభివృద్ధికి నిధులు

ఉమ్మడి జిల్లాకు రూ.28 లక్షలు మంజూరు



ఆటలతో విద్య బోధిస్తున్న రిసోర్స్ పర్సన్

పాల్వంచరూరల్: విద్యావనరుల కేంద్రాల(భవిత కేంద్రాలు) అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. విద్యావనరుల కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన 5 నుంచి 18 ఏళ్ల వయస్సు బాలబాలికలకు ఆటపాటలతో కూడిన బోధన కొనసాగుతోంది. ఇందులో విద్యాబుద్ధులు నేర్పిస్తూనే మాట్లాడడం, నడిపించడం తదితర 21 రకాల వైకల్యాలను అధిగమించేందుకు సమ్మిళిత విద్యా రిసోర్స్ పర్సన్లు(ఐఈఆర్‌పీఎస్) విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే, ఈ కేంద్రాల్లో వసతుల కల్పన, అవసరైన పరికరాల కొనుగోలుకు గత పదేళ్లుగా నిధులు మంజూరు కాలేదు. ప్రస్తుతం సొంత భవనాలు కలిగిన కేంద్రాలకు సామగ్రి కొనుగోలు, వసతుల కల్పన కోసం రూ.2లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. ఇందులో భాగంగా భద్రాద్రి జిల్లాలోని పాల్వంచ, కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం, అశ్వారావుపేట, ఇల్లెందు కేంద్రాలకు రూ.12లక్షలు, ఖమ్మం జిల్లాలోని ఏన్కూరు, కామేపల్లి(కొత్తలింగాల), ఖమ్మం రూరల్, కొణిజర్ల, మధిర, పెనుబల్లి, సత్తుపల్లి కేంద్రాలకు రూ.16లక్షలు మంజూరయ్యాయి.

జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన

జిల్లావ్యాప్తంగా 4,997 కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్

కొత్తగూడెంటౌన్: జిల్లావ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించింది. దాదాపు 4,997 కేసులకు పరిష్కారం లభించింది. కొత్తగూడెంలో సివిల్ కేసులు 11, క్రిమినల్ కేసులు 3,174, పీఎల్‌సీ కేసులు 310 కేసులు మొత్తం 3495 కేసులను పరిష్కరించారు. ఇల్లెందులో సివిల్ కేసులు 6, క్రిమినల్ కేసులు 278, పీఎల్‌సీ కేసులు 138 మొత్తం 422 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ మాట్లాడుతూ అదాలత్‌లో కక్షిదారులు సమస్యలను పరిష్కరించుకోవడం అభినందనీయమని అన్నారు. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం కావడంతో కుటుంబ కలహాలు పెరిగాయని, చిన్నచిన్న గొడవలు, క్షణికావేశంలో చేసిన నేరాలతో కోర్టుల చుట్టూ తిరుగుతూ విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని అన్నారు. రాజీమార్గమే రాజమార్గమని, రాజీ ద్వారా సమయం, డబ్బులను ఆదా చేసుకోవచ్చని చెప్పారు. కక్షిదారులకు యూనియన్ బ్యాంకు, ఎస్బీఐ ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ చేశారు. తాగునీటి సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి బత్తుల రామారావు, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.సాయిశ్రీ, కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు తోట మల్లేశ్వరావు, ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్.ఆర్ రవిచంద్ర, మహ్మద్ సాధిక్‌పాషా, వి.పురుషోత్తమ రావు, పి. నిరంజన్‌రావు పాల్గొన్నారు.

మంచి నడవడిక నేర్పాలి

జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి భానుమతి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి భానుమతి

సింగరేణి(కొత్తగూడెం): సృష్టిలో అందరికీ మొదటి గురువు అమ్మేనని, పిల్లలకు మంచినడవడిక నేర్పితే వారు మహిళల పట్ల గౌరవంగా ఉంటారని జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి భానుమతి అన్నారు. శనివారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మహిళలు ధైర్య సాహసాలతో విపత్తులను ఎదుర్కోవాలని, మహిళా సాధికారతకు కృషి చేయాలని అన్నారు. ప్రస్తుతం మహిళలు అంతరిక్ష రంగం నుంచి భూగర్భ గనుల వరకు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. విశిష్ట అతిథిగా హరిణీ సత్యనారాయణరావు హాజరయ్యారు.

అన్ని రంగాల్లో రాణించాలి

మహిళలు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగరేణి కొత్తగూడెం ఏరియా రుద్రంపూర్‌లోని ఆర్‌సీఓఏ క్లబ్‌లో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆమె మాట్లాడారు. మహిళలు వేగవంతంగా పురోగతి సాధించాలని చెప్పారు. అనంతరం అదనపు కలెక్టర్‌తోపాటు ఎఫ్‌డీఓ శాతంపురి సుజాత, భద్రాచలానికి చెందిన డాక్టర్ కట్ట సాగరికను సన్మానించారు. ఆ తర్వాత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన ఆటల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సేవా ఇన్‌చార్జి అధ్యక్షురాలు పద్మజా కోటిరెడ్డి పాల్గొన్నారు.

నేడు సింగరేణిలో మూడు పరీక్షలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం మూడు ఉద్యోగ పరీక్షలు నిర్వహించనున్నారు. సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న జూనియర్ మైనింగ్ ఆఫీసర్, జూనియర్ సర్వే ఆఫీసర్, జూనియర్ ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ పోస్టులను ఇంటర్నల్ అభ్యర్థులతో భర్తీ చేసేందుకు ఇటీవల నోటిఫికేషన్లు ఇచ్చారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష జరగనుంది. జూనియర్ మైనింగ్ ఆఫీసర్ పోస్టులు 87 ఖాళీగా ఉండగా, 21 మంది దరఖాస్తు చేసుకున్నారు. జూనియర్ ఆఫీసర్ (ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్) పోస్టులు నాలుగు ఉండగా, ఆరుగురు దరఖాస్తు చేసుకున్నారు. జూనియర్ సర్వే ఆఫీసర్ పోస్టులు 64 ఉండగా 71 మంది దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం మూడు విభాగాల్లో 151 ఖాళీలకు 98 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని యాజమాన్యం తెలిపింది.

ఈసారి మామిడి తింటామా?

చేతికొచ్చే పంట చేజారుతోంది..

- ఏటా వెంటాడుతున్న తెగుళ్ల బెడద
- మాడిపోతున్న పూత, రాలుతున్న పిందెలు
- మామిడి దిగుబడిపై రైతుల్లో ఆందోళన

ఇల్లెందురూరల్: వరుసగా ఆరేళ్లుగా దిగుబడి తగ్గి కుదేలైన మామిడి రైతుకు ఈ ఏడాది కూడా కాలం కలిసిరావడం లేదు. పూత, పిందె దశలో ఆశిస్తున్న చీడపీడలు రైతును కలవరపాటుకు గురిచేస్తున్నాయి. ఈ సారైనా కోలుకుందామనుకుంటే ఆలస్యంగా పూత రావడం, వచ్చిన పూతకు మస్సి పట్టేయడం, చిగురుగా మారడం, పిందెలు రాలిపోవడం.. వంటి కారణాలతో చేతికొచ్చే పంట చేజారుతోందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 53 వేల ఎకరాల్లో మామిడి సాగు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మామిడి 53 వేల ఎకరాల్లో సాగవుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 11 వేల ఎకరాల్లో, ఖమ్మం జిల్లాలో 42 వేల ఎకరాల్లో మామిడి పంటను సాగు చేస్తున్నారు. భద్రాద్రి జిల్లాలో అత్యధికంగా అన్నపురెడ్డిపల్లి, ముల్కలపల్లి, టేకులపల్లి, ఇల్లెందు, అశ్వారావుపేట మండలాల్లో, ఖమ్మం జిల్లాలో ఎర్రుపాలెం, తల్లాడ, పెనుబల్లి, వేంసూరు, కల్లూరు, కామేపల్లి మండలాల్లో అత్యధిక విస్తీర్ణంలో మామిడి పంట సాగవుతోంది. ఆయా తోటల్లో అత్యధికంగా బంగినపల్లి, దశేరీ, కేసరి, హిమాయత్, రాయల్ స్పెషల్, తోతాపురి, చిన్నరసాలు, పెద్దరసాలు ప్రధానంగా కనిపిస్తాయి.

పూత దశలోనే చీడపీడలు

ఏటా నవంబర్ నుంచి జనవరి వరకు పూత వచ్చి జనవరిలో అక్కడక్కడా కాయలు కాయడం మామిడి లక్షణం. ఈ ఏడాది మంచు ప్రభావంతో కొంత ఆలస్యంగా పూత వచ్చింది. వచ్చిన పూతకు తేనె మంచు పురుగు, బూడిద తెగులు ఆశించింది. ఇంతేకాకుండా ఆకుల నుంచి రసం కారడం ప్రారంభమైంది. దీనికితోడు పూత పెద్ద ఎత్తున రాలిపోయింది. మొదట ఒక చెట్టుకు సోకిన తెగులు మరునాడు దాని పక్కనే ఉన్న చెట్లకు ఇలా తోటంతా సోకిందని రైతులు చెబుతున్నారు. కొందరైతే అధికంగా తెగుళ్లు సోకిన కొమ్మలను తొలగిస్తూ ఉన్న కాస్త పంటనైనా దక్కించుకునేందుకు చేసిన ప్రయత్నాలు ఆశించిన ఫలితానివ్వలేదు. తెగుళ్ల ప్రభావంతో ప్రస్తుతం చెట్లపై పూత మాడిపోయి ఒట్టి కాడలే కనిపిస్తున్నాయి. ఆలస్యంగా వచ్చిన పూత చిగురుగా మారి రైతులను కలవరపాటుకు గురిచేస్తున్నాయి.

వెంటాడుతున్న నష్టాలు

వరుసగా ఆరేళ్ల మామిడి రైతులకు నష్టాలు తప్పడం లేదు. 2020లో భారీ వర్షాల కారణంగా పూత, పిందె పూర్తిగా రాలిపోయింది. 2021, 22లలో కాత కొంత ఆశాజనకంగా ఉన్నా కరోనా ప్రభావంతో విక్రయాలు సన్నగిల్లి ధరపై తీవ్ర ప్రభావం చూపింది. 2023లో పూత, కాత సంతృప్తిగా ఉండటంతో దిగుబడిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతుకు కాయ పక్వానికి వచ్చే సమయంలో నల్లి రూపంలో తీవ్ర నష్టం వాటిల్లింది. గతేడాది పూత సంతృప్తికరంగా ఉన్నప్పటికీ వాతావరణం అనుకూలించలేదు. మంచు ప్రభావంతో పూత క్రమంగా చిగురుగా మారి దిగుబడిపై ప్రారంభంలోనే నీళ్లు చల్లింది. ఈ ఏడాది పూత దశ నుంచే చీడపీడలు ఆశించడం, పిందెలు రాలిపోవడంతో దిగుబడిపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇలా అతివృష్టి, అనావృష్టి, చీడపీడలు, కరోనా తదితర కారణాలతో వరుసగా ఆరేళ్లుగా మామిడి రైతులు నష్టాలతో కొట్టుమిట్టాడుతున్నారు.

ఆందోళనలో కౌలుదారులు

మామిడి రైతులు అత్యధికంగా పూత దశలోనే తోటలను కౌలుకు ఇస్తుంటారు. తోటలను పరిశీలించిన కౌలుదారులు ధర నిర్ణయించి రైతులకు ముందస్తుగా కొంత, పంట చేతికందని తరువాత మిగతా సొమ్ము చెల్లిస్తారు. ఈ ఏడాది కూడా రూ.లక్షలు కౌలు చెల్లించి మామిడి తోటలు తీసుకున్న కౌలుదారుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. కౌలు డబ్బు, ఎరువుల పెట్టుబడి, పురుగు మందుల పిచికారీ వారికి మరింత భారమవుతోంది. తోటల్లో చీడపీడల ప్రభావం అధికంగా ఉండటంతో నాలుగైదు సార్లు పురుగు మందు పిచికారీ చేసినా ఫలితం కనిపించక ఆందోళన చెందుతున్నారు.





కొమరారంలో మామిడితోట (ఇన్‌సెట్) పూత దశలో చిగురుగా మారిన చెట్లు

పెట్టుబడి భారమవుతోంది



ఈ ఏడాది పూత దశలోనే చెట్లను తెనె మంచు, బూడిద, మస్సిరోగం ఆశించాయి. మంచు ప్రభావంతో చాలా చెట్లకు ఆలస్యంగా వచ్చిన పూత క్రమంగా చిగురుగా మారింది. పూతను కాపాడుకునేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. చివరకు తోటల్లో చీడపీడల నివారణకు పెట్టిన పెట్టుబడి భారంగా మారింది.

– మంచె కృష్ణయ్య, మామిడి రైతు, కొమరారం, ఇల్లెందు మండలం

వరుస నష్టాలు కుంగదీస్తున్నాయి



ఆరేళ్లుగా మామిడి కలిసిరావడం లేదు. అతివృష్టి, అనావృష్టి, చీడపీడలు.. ఏదో ఒక రూపంలో వరుస నష్టాలు కుంగదీస్తున్నాయి. నివారణకు రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టినా ఫలితం కనిపించడం లేదు. ఈ ఏడాది కూడా పిందెలు రాలిపోవడం, చీడపీల ఉధృతి వంటి కారణాలు దిగుబడిపై ప్రభావం చూపేలా కనిపిస్తున్నాయి.

–తోకల జానయ్య, మామిడి రైతు, కొమరారం, ఇల్లెందు మండలం

క్లుప్తంగా

రామాలయానికి ఈ-స్కానర్లు బహూకరణ



ఈ-కానుక స్కానర్లను అందజేస్తున్న ఎస్‌బీఐ అధికారులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానానికి శనివారం ఎస్‌బీఐ రామాలయం శాఖ మూడు ఈ-కానుక స్కానర్లను బహూకరించింది. ఈ కార్యక్రమంలో భద్రాచలం దేవస్థానం ఏఈఓ శ్రావణ్ కుమార్, దేవస్థానం ఈఓ సీసీ శ్రీనివాసరెడ్డి, ఎస్‌బీఐ ఆర్‌ఎం సత్యనారాయణ, మేనేజర్ మధుసూదన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు రోజుల్లో కుమార్తె వివాహం

- గుండెపోటుతో తండ్రి మృతి



వెంకన్న (ఫైల్)

పాల్వంచరూరల్: మరో నాలుగు రోజుల్లో కుమార్తె వివాహం ఉండగానే అంతలోనే రైతు గుండెపోటుతో మృతిచెందాడు. దీంతో ఆ ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. మండలంలోని మొండికట్ట గ్రామానికి చెందిన రైతు, సొసైటీ మాజీ డైరెక్టర్ చిల్లా వెంకన్న (50) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య పుణమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమార్తె వివాహానికి సంబంధించిన శుభలేఖలు పంపిణీ చేసి, ఇంటికి వచ్చి రాత్రి ఆకస్మికంగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగారు. కొత్వాల శ్రీనివాసరావు, యర్రంశెట్టి ముత్తయ్య, రౌతు రామారావు, అంబేడ్కర్, మోహన్‌రావు తదితరులు వెంకన్న మృతదేహాన్ని సందర్శించారు.

రేషన్ బియ్యం పట్టివేత

టేకులపల్లి: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శనివారం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ సురేశ్ కథనం ప్రకారం.. మండలానికి చెందిన భూక్య లాలు మండల కేంద్రంలోని బోడబజారు నుంచి బొలేరో వాహనంలో రేషన్ బియ్యం తరలిస్తున్నాడనే సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వాహనంలో 34.20 క్వింటాళ్ల బియ్యం ఉండటంతో వాటిని పౌరసరఫరాలశాఖ డీటీకి అప్పగించారు. భూక్య లాలు, డ్రైవర్ లచ్చిరాంపై కేసు నమోదు చేసి, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ వివరించారు.

బీఎస్‌ఎన్‌ఎల్.. ఏది సిగ్నల్..?

- దురదపాడులో నెలరోజులుగా పని చేయని వైనం
- టవర్ వద్ద గిరిజనుల నిరసన



టవర్ వద్ద సెల్‌ఫోన్లతో నిరసన వ్యక్తం చేస్తున్న వినియోగదారులు

అశ్వారావుపేటరూరల్: అటవీ ప్రాంతాల్లోని గిరిజన పల్లెలకు సెల్‌ఫోన్ సేవలు అందించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు ప్రభావిత నిధులతో ఏర్పాటు చేసిన బీఎస్‌ఎన్‌ఎల్ టవర్లు నిరుపయోగంగా మారాయి. దీంతో స్థానికులు టవర్ వద్ద సెల్‌ఫోన్లతో నిరసన వ్యక్తం చేశారు. అశ్వారావుపేట మండలంలోని దిబ్బగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని దురదపాడు గిరిజన గ్రామంలో కొన్నేళ్ల కిందట మావోయిస్టు ప్రభావిత నిధులతో బీఎస్‌ఎన్‌ఎల్ టవర్ ఏర్పాటు చేశారు. దీని పరిధిలో నెల రోజులుగా సెల్‌ఫోన్ సిగ్నల్స్ రావడం లేదు. ఒకపక్క ప్రైవేట్ సెల్ కంపెనీలు పోటీలు పడి రోజురోజుకూ టెక్నాలజీ సాయంతో ఉత్తమ సేవలు అందిస్తుండగా, బీఎస్‌ఎన్‌ఎల్ అధికారులు మాత్రం మొద్దు నిద్ర పోతున్నారా? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. బీఎస్‌ఎన్‌ఎల్‌కు ఆదరణ తగ్గిపోతోందనే ప్రచారం ఎప్పటినుంచో ఉంది. కాగా, నెల రోజులుగా ఈ టవర్ పరిధిలో సిగ్నల్స్ అందకపోవడంతో ఫోన్, ఇంటర్నెట్ వినియోగదారులంతా అవస్థ పడుతున్నారు. టవర్ ఉండటంతో స్థానిక గిరిజనులు అధిక సంఖ్యలో బీఎస్‌ఎన్‌ఎల్ సిమ్‌లనే వాడుతున్నారు. సిగ్నల్స్ అందక గ్రామంలో ఉన్న టవర్ నిరుపయోగంగా మారందని వినియోగదారులు చెబుతున్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితి వస్తే (108 వాహనం, ఫైర్, డయల్ 100) సమాచారం ఇచ్చేందుకు దూరంలో ఉన్న మరో గ్రామానికి వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. బీఎస్‌ఎన్‌ఎల్ అధికారులకు చెప్పేందుకు ప్రయత్నించగా వారు అందుబాటులో లేరని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. కాగా, బీఎస్‌ఎన్‌ఎల్ ఎస్‌డీఈ హర్షవర్ధన్‌రెడ్డికి వివరణ కోసం ఫోన్ చేయగా స్పందించలేదు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

ఇల్లెందు: ఇల్లెందులోని దాసరిగడ్డకు చెందిన బి.రామారావు(40) శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ కలహాలతో ఆయన బలవన్మరణానికి పాల్పడినట్లు తెలుస్తుండగా, కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. కాగా, రామారావు ఇల్లెందు మున్సిపాలిటీలో బదిలీ వర్కర్‌గా పనిచేస్తున్నాడు.

పేకాట స్థావరంపై దాడి

ఇల్లెందు: పట్టణంలోని నంబర్–2 బస్తీ సమీపంలోని అటవీ ప్రాంతంలో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. 9 మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.82 వేల నగదు, మూడు బైక్‌లు, 8 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. సీఐ బత్తుల సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రైల్వే లైన్ పనులు త్వరగా ప్రారంభించండి

- కేంద్ర రైల్వే మంత్రికి మంత్రి తుమ్మల లేఖ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: పాండురంగాపురం – మల్కాన్‌గిరి రైల్వేలైన్ మంజూరు చేయడంపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ రైల్వే మార్గాన్ని తొలిదశలోనే సారపాక వరకు త్వరగా పూర్తిచేస్తే భక్తులు రైలులో చేరుకుని, అక్కడి నుంచి ఇతర వాహనాల్లో భద్రాచలానికి చేరుకునే వీలుంటుందని మంత్రికి రాసిన లేఖలో పేర్కొన్నారు. తద్వారా భద్రాచలానికి వచ్చే భక్తులకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని తెలిపారు. ఇదే సమయాన సత్తుపల్లి – కొవ్వూరు, పెనుబల్లి(ఖమ్మం) – కొండపల్లి(అమరావతి) వరకు కొత్త రైల్వేలైన్లు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని ఆ లేఖలో తుమ్మల కోరారు.

‘థర్డ్ డిగ్రీ’పై విచారణ చేపట్టాలి

- పోలీస్ స్టేషన్ వద్ద బాధితుడు, దళిత సంఘాల డిమాండ్



పోలీస్ స్టేషన్ వద్ద నాగరాజు, కుటుంబీకులు

అశ్వారావుపేట: కోడి పుంజు చోరీ కేసులో తనపై థర్డ్ డిగ్రీ, కరెంట్ షాక్ ఇచ్చిన స్థానిక అదనపు ఎస్‌ఐ రామ్మూర్తిని తక్షణమే సర్వీస్ నుంచి డిస్మిస్ చేయాలని బాధితుడు, దళిత సంఘాల బాధ్యులు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. మండలంలోని నారంవారిగూడేనికి చెందిన కలపాల నాగరాజుపై అదే గ్రామానికి చెందిన అప్పారావు కోడి పుంజు చోరీ చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఈ నెల 1వ తేదీ రాత్రి నాగరాజును ఒప్పుకోవాలని స్థానిక అదనపు ఎస్‌ఐ రామ్మూర్తి థర్డ్ డిగ్రీ ప్రయోగించి, కరెంట్ షాక్ ఇచ్చినట్లు బాధితుడు ఆరోపించిన సంగతి తెలిసిందే. కాగా, శనివారం బాధితుడిని కుటుంబీకులు, దళిత సంఘాల నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి న్యాయం చేయాలని కోరారు. అలాగే, సీఐ కరుణాకర్‌ను కలిసి అదనపు ఎస్‌ఐపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఎదుట బాధితుడు, దళిత సంక్షేమ సంఘం జాతీయ నాయకుడు తగరం రాంబాబు మాట్లాడారు. కోడి పుంజు కేసు నెపంతో తీవ్రవాదిలా వ్యవహరించి థర్డ్ డిగ్రీకి పాల్పడి, చిత్రహింసలకు గురిచేశారని పేర్కొన్నారు. దళితుడికి రక్షణ కల్పించాల్సిన పోలీసులు, ఇలాంటి దాష్టికానికి పాల్పడటం దారుణమని మండిపడ్డారు. ఈ ఘటనపై రాష్ట్ర డీజీపీ, ఎస్పీ స్పందించి సమగ్ర విచారణ జరిపించాని డిమాండ్ చేశారు.

చోరీ నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సతీశ్

పాల్వంచ: పట్టణంలోని నవభారత్ ఎంప్లాయీస్ క్వార్టర్లలో దొంగతనాలకు పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం సీఐ సతీశ్ వివరాలు వెల్లడించారు. శనివారం పట్టణంలోని సీ–కాలనీ వద్ద అనుమానాస్పదంగా ఓ వ్యక్తి ఉన్నట్లు సమాచారం అందడంతో సీఐ సతీశ్, పట్టణ ఎస్‌ఐ సుమన్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి అదుపులోకి తీసుకున్నారు. నవభారత్ ఎంప్లాయీస్ క్వార్టర్లలో చోరీలకు పాల్పడిన, మధ్యప్రదేశ్ రాష్ట్రం ధార్ జిల్లా తండా పోలీస్ స్టేషన్ పరిధిలోని అనిల్ సింఘూర్‌గా గుర్తించారు. గత జనవరి 25న మరో ముగ్గురితో కలిసి నవభారత్ క్వార్టర్లలో చోరీలకు పాల్పడ్డాడని, అతని వద్ద నుంచి రూ.2 లక్షల నగదు, ఒక స్మార్ట్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామని సీఐ పేర్కొన్నారు. పరారీలో ఉన్న వ్యక్తుల కోసం గాలింపు చర్యలు చేపట్టామని ఆయన వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మరో నెలలో పెళ్లికి సిద్ధమవుతుండగా ఘటన



కళ్యాణ్ (ఫైల్)

కారేపల్లి: మండలంలోని సూర్యతండా గ్రామానికి చెందిన యువకుడు మహబూబా బాద్ జిల్లా బయ్యారం మండలం మిర్యాలపెంట సమీపాన శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యతండాకు చెంది న బానోతు కళ్యాణ్ (26), అజ్మీరా విజయ్ ద్విచక్రవాహనంపై శుక్రవారం గంగారం మండలం ఒట్టయిగూడెంలో తన స్నేహితుడి పెళ్లికి వెళ్లి రాత్రి తిరిగి వస్తున్నారు. ఈక్రమాన మిర్యాలపెంట వద్ద బైక్ అదుపు తప్పి వాహనం నడుపుతున్న కల్యాణ్‌కు రోడ్డుపక్కన ఉన్న చెట్టు దుంగ బలంగా తాకడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. విజయ్ స్వల్పగాయంతో బయటపడ్డాడు. దీంతో స్థాని కులు వీరిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే కళ్యాణ్ మృతి చెందా డు. పోస్టుమార్టం అనంతరం ఆయన మృతదేహాన్ని సూర్యతండాకు శనివారం తీసుకొచ్చారు. కాగా, కళ్యాణ్‌కు రెండు నెలల క్రితమే వివాహం నిశ్చయమైంది. హోలీ పండుగ తర్వాత ముహూర్తం పెట్టుకోవాలని భావిస్తుండగానే ఆయన మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది.

వీల్‌చైర్ క్రికెట్ క్రీడాకారులకు అభినందన

ఖమ్మంమయూరిసెంటర్: నేషనల్ వీల్‌చైర్ క్రికెట్ టోర్నీ లో ప్రతిభ చాటిన జిల్లా క్రీడాకారులను ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి శనివారం అభినందించారు. జిల్లాకు చెందిన ఎస్.కే.సమీరుద్దీ న్, బండి రాము, సురేష్, రమావత్ కోటేశ్వర్, మహ్మద్ సమీ జట్టు విజయానికి తోడ్పడ్డారు. ఈ సందర్భంగా వారిని ఎంపీ ఖమ్మంలో సన్మానించగా మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారా యణ, పాపా నాయక్ పాల్గొన్నారు.

కొండ గొర్రె మాంసం పట్టివేత

గుండాల: వేటగాళ్లకు కొండ గొర్రె మాంసాన్ని పంచుకుంటుండగా పట్టుకొని కేసు నమోదు చేశామని అటవీశాఖాధికారులు శనివారం తెలిపారు. చింతలపాడు గ్రామానికి చెందిన ఇద్దరు చేపల వేటకు వెళ్లగా కుక్కలు ఓ కొండ గొర్రెను వేటాడాయి. ఆ మాంసాన్ని తెచ్చుకున్న ఇద్దరు అటవీ శాఖ అధికారులకు పట్టుబడ్డారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వారిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామని అటవీశాఖ అధికారులు నరసింహారావు, బాలాజీ తెలిపారు.